# మెఱుపులు: తిమ్మన పద్దెము

- వేమూరి వేంకటరామనాథం

"తెలుగు జ్యోతి" వెనుకటి సంచిక ఒక దానిలో పెద్దన వ్రాసిన మనుచరిత్రలోని ఒక పద్యం తీసికొని అందలి కవితాసౌందర్యం వివరించ ప్రయత్నించాను. అలాగే యీ వ్యాసంలో తిమ్మన వ్రాసిన "పారిజాతాప హరణము" కావ్యములోని ఒక పద్యం తీసికొని దానిలోని కవిత్వవిలాసం విశదీకరించ సంకల్పిస్తున్నాను.

కథ తెలిసినదే కాబట్టి సూక్ష్మంగా, ఈవ్యాసానికి అవసర మయినంత వఱకు, సూచిస్తాను. నందనవనంలోని పారిజాతపుష్పం ఒకటి (కలహ భోజన ప్రియుడైన) నారదుడు తెచ్చి రుక్మిణీ గృహంలో ఉన్న కృష్ణునికి ఈయగా, కృష్ణుడు వెంటనే ఆపూవును రుక్మిణికి ఇస్తాడు. అది "పరిమళము సెడదు, వాడదు" అన్న పొగడ్తగన్న పూవు. ఇది తెలిసికొని సత్యభామ "కోపగృహం" లో ప్రవేశిస్తుంది. ఆపైన కృష్ణుడు ఆమె యొద్దకు రాగా,

మ. "జలజాతాసనవాసవాది సుర పూజాభాజనంబై తన
ర్చు లతాంతాయుధు కన్నతండ్రి శిరమచ్చో వామపాదంబునన్
దొలగ ద్రోసె లతాంగి; యిట్ల యగు నాథుల్ నేరముల్ సేయ బే
రలుకం జెందిన యట్టి కాంత లుచితవ్యాపారముల్ నేర్తురే."

ఇది ప్రస్తుత వ్యాసాన్ని ప్రేరేపించిన పద్యం. ఆకావ్యం లోని కథకు గడుసైన నాందీప్రాయంగానే కాక, కవితాసౌందర్యంలో ప్రఫుల్ల మయినదని మనవిచేస్తున్నాను.

తొలుదొల్త ముక్కుతిమ్మనార్యు "ముద్దుపల్కు"ను పురస్కరించు కొని యీ పద్యంలోని కొన్ని పల్కులను సూచిస్తాను. కృష్ణుని పేర్కొంటూ - సాధ్యమయిన అనేక పద సంవిధానాలలో - తిమ్మన ఎంచినది "లతాంతాయుధు కన్నతండ్రి" అని. "జనకుడ"ని కాని, పితృదేవు"డని కాని - ఈవిధమైన అనేక ఇతర పదాలను కాని - కాక, కేవలం "కన్నతండ్రి" అని నిర్దేశించాడు. ఈముద్దుపల్కుకు ఈ సందర్భంలోగల అధికప్రత్యేకతయే మంటే, అలాంటి "కన్న తండ్రి" ని సత్యభామ తన్నింది!

సరే, ఆ "తన్నటం" ఎలా వర్ణించాడు తిమ్మన! కేవలం "తన్నె" ననకుండా, కృష్ణుని శిరమును "తొలగంద్రోసె" లతాంగి. జరిగినది యేమంటే, ఆమె కృష్ణుని తలమీద తన్నింది. కాని, వాని గౌరవం నిల్పటానికో అన్నట్లు వాని శిరమును "తొలగంద్రోసె"నదని వ్రాశాడు. పైగా అత్రోసినది "లతాంగి", తీవెవంటి శరీరం గల సత్యభామ. ఆ"తీవె" తాకుడు మృదువుగా ఉండి ఉండాలి. తన్ను తన్నే కాని, అది నిర్దేశించటంలో తిమ్మన ఎంత జాగరూకత వహించాడో! స్త్రీకి గల ఎన్నో పర్యాయపదాలలో "లతాంగి" అన్న మృదువైన పదం వాడాడు!

ఇక ఆ తొలగందోయుట "వామపాదంబునన్!" "ఎడమ" కు "కుడి"కన్న కొంత తక్కువతనం ఆరోపించబడటం - కారణం ఉన్నా లేకపోయినా - సంఘంలో కొంత వఱకు ఆనవాయితీ అయింది గదా: మనలో చాల మందికి అనుభవంలో ఉన్న ఒక విషయం చూడండి: క్రొత్త యింటిలో ప్రవేశించే దంపతులను "కుడికాలు పెట్టండి" అని కుటుంబం పెద్దలు వెనుక నుండి దరిదాపు ఆదేశిస్తూ ఉంటారు. ఇది మనం గమనించియే ఉంటాము. కుడి-ఎడమలకు చెందిన ఒక ఇటీవలి సన్నివేశం నివేదిస్తాను. అమెరికాలో ఒక గుడిలో ఒక చిన్నపిల్లవాడు నాప్రక్కనే నడుస్తూ, పూజారి ప్రసాదం పెట్టవచ్చి నప్పుడు తన ఎడమచేయి పైకి ఎత్తాడు. నేను తటాలున, అనుకో కుండానే అన్నట్లు, వానివంక చూసి "చ్... కుడి చెయ్యి జాపు నాయనా" అన్నాను. వాడు వెంటనే ఎడమ చేయి వెనుకకు లాగి, కుడిచేయి ఎత్తాడు; నవ్వుతూ పూజారి అరటిపండు ముక్కలు వాని చేతిలో ఉంచాడు. తెలియక ముందు ఎడమచేయి యెత్తి, ఎందుకో తెలియకే నామాట మీద కుడిచేయి జాపిన ఆ బాలుని ముఖంలో ఏవిధమైన ప్రత్యేక స్పందన లేదు. తన దారిన తాను నడచి పోతు న్నాడు. "మాపిల్ల వాని సంగతి మీకెందుకండీ" అని వాని తల్లి ఈసడిస్తుందేమోనని కొంచెం భయపడ్డానుగాని, ఆమె కూడ

"ఈకాలం పిల్లలకు చెప్పాలండీ" అంటూ వెళ్ళింది. జాగ్రత్తగా ఆలోచిస్తే, ఎడమచేయి - కొందఱి శరీర తత్వాలలో - కుడిచేయిలాగానే పనిచేస్తుంది. వారి అంగ ప్రత్యేకతలను బట్టి ఎడమ -చేయివాటం ధృడమవుతుంది. మన మెఱిగిన గొప్పవారిలో అమెరికా అధ్యక్షత వహించిన బిల్‌క్లింటన్ వామహస్తుడే!

ఇలాంటి అనధికసంఖ్యాకులను వదలి, సాధారణంగా "ఎడమ" కు "కుడి"కన్న కొంచెం తక్కువతనం జనసామాన్యం దృష్టిలో ఉంది. సత్యభామ తన భర్త కృష్ణుని "వామపాదంబునన్ తొలంగంద్రోసె" అని ప్రత్యేకం గా నిర్దేశించటంలో తిమ్మన ఆమె కోపసంతప్తమైన హృదయం వర్ణించాడు. ఈవ్యాసంలోని తుది విషయం జాగ్రత్తగా పరిశీలిస్తే ఆమె మనస్థితి సవివరంగా మనకు అర్థం అవుతుంది. ఆమె తన భర్తను తన్నటమే కాదు, "ఎడమకాలితో" నన్న ప్రత్యేక వివరం తిమ్మన రచనలో ప్రముఖ విశేషంగా మనం గమనించాలి.

ఇక తుది విషయానికి వస్తాను. సత్యభామ కృష్ణునకు చేసిన "మర్యాద"ను వివరంగా వర్ణించిన పిదప, తిమ్మన ఒక చక్కని అర్థాంతరన్యాసాలంకారం ప్రయోగించాడు. "నాథులు" "నేరములు చేయ"గా "పేరలుక" పొందిన కాంతలు (భార్యలు) ఉచితమైన పనులు చేయగల్గుతారా, అని ఒక ప్రశ్నతో పద్యం పూర్తి చేస్తాడు. ఇలాంటి పనులు - భర్తను తలమీద తన్నటం, అందులో ఎడమకాలితో - ఉచితమైనవి కాదని ధ్వనిస్తూ, ఐనా అలాంటి పరిస్థితులలో "పేరలుక" దాల్చిన - ఎక్కువ కోపం పొందిన - భార్యలు "ఉచితమై"న పనులు నేరుస్తారా, అని ప్రశ్నిస్తాడు తిమ్మన. ఇది - మొత్తం మీద - "ఉచిత" మైన పనికాదని ధ్వనిస్తూ, అయినా ఇలా కాక ఉచితమైన "వ్యాపారములు" ఆ స్త్రీలకు సాధ్యమవుతాయా అన్నాడు. అలాంటి స్త్రీల పక్షంగా మాట్లాడుతున్నట్లే ఉండి, వారి పనులు మాత్రం "ఉచిత"మైనవి కాదు అని ధ్వనించాడు తిమ్మన.

ఇది, దెబ్బకొట్టినట్లు ఉండాలి, కాని తగల కూడదు అన్నట్లు, అటు ఇటుగా ఉంది. ఈ వైపరిత్యాన్ని పూర్తిగా అర్థం చేసికొనటంలో ఆనాడు కృష్ణదేవరాయలు - భార్య చిన్నాయమ్మల మధ్య అపవాదు రేగిన సంఘటన ఒకటి, చిన్ననాటి నుండి నేను పెద్దలనుండి వింటూ వచ్చినది ఉంది. అది ఎంత వఱకు - నూటికి నూరుపాళ్ళు - నిజమో ఆకృష్ణదేవరాయలు, చిన్నాయమ్మలకు మాత్రమే తెలియాలి. కాని జనసామాన్యంలోను, సారస్వతప్రియులలోను, ఈకథ ఏండ్లుగా నిలిచియుంది. ఒక రేయి పొరపాటున చిన్నాయమ్మ కాలు కృష్ణదేవరాయల తలకు శయన కాలంలో - తగిలిందట, ఆ మహారాజుకు కోపంవచ్చి ఇక ఆమె మందిరానికి వెళ్ళటం చాలించాడుట. ఈ అవస్థ ఆమెతో "తోడు"గా "అరణం"గా వచ్చిన తిమ్మనకు తెలిసి, ప్రజ్ఞావంతుడైన కృష్ణదేవరాయలకు ఇది "పొరపాటు" - "మహామహా" దంపతుల మధ్యన జరిగిన తరగతిలోనిది - అని నిరూపించవలసిన అవసరం తట్టి, ఈ పారిజాతాపహరణ కావ్యంలో కేవలం భగవత్ స్వరూపుడైన శ్రీకృష్ణునికే ఇలాంటి అవస్థ ఒకసారి కలిగింది అని నచ్చచెప్పదలచాడు తిమ్మన, అని అనాదిగా వస్తున్న కథ. ఇది నిజమో కాదో కాని దాని సందర్భశుద్ధి మాత్రం స్పష్టంగా ఉండి, ఈకథ ఈ నాటికీ మన దృష్టిని తప్పుకుపోలేదు.

ఈ అర్థాంతరన్యాస చర్చ ముగించే ముందు ఒక ప్రశ్న - ఉచిత మైన వివరం పేర్కొనాలి, అనుకుంటాను. కృష్ణుడు చేసినది నేరమా, ఆపారిజాతపుష్పం రుక్మిణికి వెంటనే యీయటంలో? అది సత్యభామకు అనిష్టమైన కార్యం కావచ్చును; ఆమె తన క్రోధంలో అలా అనుకొనవచ్చును, అది నేరమని, బహుశః కృష్ణుడు చేయవలె నని అలా చేసియుండవచ్చును అని. ఈ కారణంగా మన చర్చలో ఒక చిన్న మలుపు ప్రవేశపెట్ట వలసి యుంటుంది; "నేరముల్ సేయ" లేక భార్యలకు నేరములుగా అనిపించేవి "సేయు" అని. ఇపుడు ఈ అర్థాంతరన్యాసం సంపూర్ణంగా సకల పరిస్థితులలోను అర్థవంతం అవుతుంది.

ఈ పద్యంలోని కవితాప్రభావం గల విషయాలను తిరిగి ఒకదాని వెంటనొకటి "జాబితా" చేయనక్కఱేదన్న ధైర్యంతో అవి పాఠక మహాశయులకు వదలివేస్తున్నాను. *****